
# మట్టి గాజులు

- డా. వి. పోతన్న



ఉగాది కథల పోటీలో ఎంపికైన కథ

'కళ్ళు' లేవు

కాళ్లూ, చేతులూ లేవు.

ఇక ముక్కూ, ముఖమూ సరేసరి.

'నోరు' ఉంది. అదీ ఉండవలసిన చోట కాదు. నెత్తి మీద.

ఒక్క 'చెవి' మాత్రమే ఉంది. విచిత్రమైన రూపం. అయినా ఆత్మీయంగా ఉంటుంది. ఒళ్ళంతా కడుపే. ఎంత పెట్టినా తింటుంది. ప్రాణం లేదు. అయినా పలుకుతుంది. తానంత తాను కాదు. పొట్ట మీద వేళ్ళతో పొడవాలి. పొడిచినంత మాత్రాన రెచ్చిపోయి పలకదు. 'ఒక రూపాయి నాణెం' నెత్తి మీద ఉన్న నోటికి లంచంగా అందించాలి. అప్పుడు ఎంత పొడిచినా పలుకుతుంది. మళ్ళీమళ్ళీ పలుకుతూనే ఉండాలంటే కచ్చితమైన సమయంలో మరో రూపాయి రూక నోటికి అందివ్వాల్సిందే. తగిన సమయంలో 'నాణెం' అందకపోతే 'కుక్కపిల్ల'లా 'కుయ్ కుయ్' అని అరుస్తుంది. మాటల్లో పడి ఇవ్వడం మరచిపోయామో మూతి ముడుచుకుంటుంది. పలుకు ఆగిపోతుంది. 'రూపాయి నాణెం టెలిఫోన్ బాక్సుకు' మెదడుకు పదునుపెట్టే 'పొడుపు కథ' - అంత చరిత్ర ఉంది ఈ ఫోన్ బాక్సుకు.

★ ★ ★

"ప్లీజ్ - చెక్ ద నెంబర్ యుహ్యావ్ డయల్" - అని ఒక సారి, "ప్లీజ్! డయల్ యువర్ కార్డు నెంబర్" అని ఇంకో సారి, "ప్లీజ్! డయల్ యువర్ డెస్టినేషన్ నెంబర్" అంటూ మరోసారీ, ఇలా గడియ, గడియకూ మాట మారుస్తున్న చిలకలకొలికి పలుకులు ఎడతెరిపి లేకుండా ముద్దు ముద్దుగా వినటమే గానీ, పని జరగకపోయేసరికి, మీనాక్షికి విసుగు పుట్టింది. "ఈ రూట్లో లైన్లన్నీ బిజీగా ఉన్నాయి"అనో "ఆప్ కా టెలిఫోన్ నెంబర్ ఉపలబ్ధి నహీ హై" అనో - ల్యాండ్ ఫోన్ చెప్పే చచ్చు మాటలు వినీ వినీ ఇక దానితో ఏగలేక, ఆగలేక, లాభం లేదనుకొని, భర్త శ్రీధర్‌పై కోపం తెచ్చుకుంది మీనాక్షి... "బంగారం లాంటి ఎస్‌టిడి ఫోన్. ఎప్పుడు కావలసి వస్తే అప్పుడు చేస్తూ ఉంటే ఇప్పుడు ఇలా తగలబడింది" అనుకుంటూ భర్త చేసిన పనిని పెదాలతో చెప్పుకుంది.

మొన్న మొన్నటి వరకూ సక్రమంగా పని చేసిన ఫోను - అంచనాలకు మించి బిల్లు వచ్చిన కారణంగా శ్రీధర్ అందుకు కారణమైన 'ఎస్‌టిడి' సౌకర్యాన్ని కట్ చేయించాడు. కాస్త కష్టమైనా సరే! అవసరం వచ్చినప్పుడు ఇంటి నుంచే చేసుకోవటానికి వీలుగా 'ఐటిసి' కార్డు తీసుకున్నాడు. తీసుకున్నాడు గానీ అది ఏనాడూ సక్రమంగా పని చేసింది లేదు. లైన్సు బిజీగా ఉన్నాయనో, మరే కారణం చేతనో, గుర్తుకు వచ్చినప్పుడల్లా స్ట్రైక్ చేస్తూనే ఉంది.

ఉదయం ఆరు గంటలకు వెళ్ళిన శ్రీధర్ రాత్రి తొమ్మిది అయినా ఇంటికి రాకపోయేసరికి ఎక్కడ ఉన్నాడో కాస్త తెలుసుకుందామని 'ఐటిసి' కార్డున్న ల్యాండ్ ఫోన్‌తో ట్రై చేసీ చేసీ విసుగుపుట్టి, ఇక చేసేది లేక రూపాయి నాణేలు గుప్పెట్లో పెట్టుకొని ఇంటికి కాస్త దూరంలో ఉన్న 'రూపాయి కాయిన్ టెలిఫోన్ బాక్సు' దగ్గరకెళ్ళింది మీనాక్షి.

ఆ వీధి అంతటికీ అదొక్కటే కాయిన్ బాక్స్. చౌకధర దుకాణంలా ఉంది. 'క్యూ'లో జనం ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్నారు. పిల్లలూ, పెద్దలూ, ఆడ, మగ ఉన్నారు. ప్రేమికులూ ఉన్నారు. తెలుగూ, ఇంగ్లీషూ, హిందీ భాషలూ ఉన్నాయి.

గంటకు గాని, ఫోనుతో... తన గోడు చెప్పుకునే అవకాశం రాలేదు మీనాక్షికి. ఆ సమయంలో శ్రీధర్‌ను ఎన్ని సార్లు తిట్టుకుందో!

'నిరీక్షణ' అయిపోయింది.

'రిసీవర్'ను అందుకుంది.

గుప్పెట్లో ఉన్న రూపాయి నాణేలలో ఒకటి ఫోన్ నోటికి అందించింది.

'వైరాజూ! గుండెల్లో నువ్వే

వైరాజూ! కళ్ళల్లో నువ్వే' అంటూ సినిమా పాట వాద్య సంగీతాన్ని, శ్రీధర్ జేబులో విశ్రాంతి తీసుకుంటున్న 'సెల్ ఫోన్' పాడింది. నచ్చిన పాట. మెచ్చిన సంగీతం. అలా కమ్మగా వినిపించేసరికీ... "చస్తి గదరా!దేవుడా! ఇప్పుడెట్లా' అనుకుంటూనే, ఫోన్ కళ్లల్లో వెలుగుతున్న లైటులో నెంబర్ చూశాడు. కొత్త నెంబర్! ఎవరో తెలియదు... ధైర్యంగా... "హలో! శ్రీధర్ హియర్! ఎవరండీ" అన్నాడు. సమాధానం లేదు. "హలో! హలో!!.. ఎవరూ?" మళ్ళీ అడిగాడు.

ఇంట్లో ఫోన్‌తో కొంత, వీధిలో ఫోన్‌తో కొంత. విసిగిపోయిన మీనాక్షి... శ్రీధర్ సెల్‌ఫోన్ నుంచి వచ్చిన 'ఆ శబ్దం' వినీ... అది ఏ నాదమో! తెలుసుకుంది. భర్తతో ఏదేదో మాట్లాడదామనీ, ఫోన్ కోసం తాను పడిన తిప్పలు గురించి తన అక్కసునంతా వెళ్ళగ్రక్కుదామనీ' అనుకున్న మీనాక్షి!... 'ఆ సవ్వడి' వినేసరికి నోటి మాట పళ్ళ మధ్యనే ఇరుక్కుపోయింది...

"హలో! హలో...! మాట్లాడరేంటీ?" అని శ్రీధర్ మళ్ళీ ఒకటి రెండుసార్లు అడిగాడు. భర్త మాటల్లో కలిసి వచ్చిన 'ఆ స్వరం'... మళ్ళీ చెవులకు సోకగానే మీనాక్షి ఇక ఆగలేకపోయింది.

"నేనే!... ఈ టైమ్‌లో నేను కాకుండా ఇంకా ఎవరన్నా ఫోన్ చేసేవాళ్ళున్నారా" అంది.

"ఓహ్!... నువ్వా మీనాక్షీ! ఎవరో అనుకున్నాను. మన ఇంటి నెంబర్ కాదే.. ఏమైంది మన ఫోనూ!"

"చచ్చింది మోసుకొని పోవాలి. వచ్చేటప్పుడు 'పాడె' ఒకటి తీసుకునిరా!"

"యూ! సిల్లీ!...సరేసరే! ఇంకో పది నిమిషాల్లో వచ్చేస్తా" అని ముక్తసరిగా మాట్లాడీ, అంతకు మించి మాట్లాడితే అక్కడ ఉన్న వ్యక్తి ఏమనుకుంటుందో! అనుకుని ఫోన్ కట్ చేశాడు.

ఈ సెల్‌ఫోన్ ఉన్నందువల్ల ఎంత మంచి పని జరిగిందీ! ఈయనగారి లీలలు తెలిపింది సెల్‌ఫోన్!... సెల్ ఫోన్ అని జనం ఎందుకు ఎగబడుతున్నారో ఇప్పుడు అర్థమైంది.... రానీ ఇంటికి' అని మనసులోనే అనుకుంటూ ఇంటికి వచ్చింది మీనాక్షి.

బయట స్కూటర్ ఆగిన శబ్దం. మీనాక్షి బిగుసుకుంది. అంతా చీకటి. శ్రీధర్ ఊహించినట్లే జరిగింది. శ్రీధర్ తన ఆలస్యం గురించే ఆలోచిస్తున్నాడు. మీనాక్షి అది తప్ప అన్నీ ఆలోచిస్తోంది. ఎంత ఆలస్యమైనా, గేటు తాళం వెయ్యదు. ఇంటికి శ్రీధర్ వచ్చేవరకూ గేటు లైట్లు మీనాక్షి కళ్లలాగే వెలుగుతూ ఉండేవి... 'ఎందుకు లైట్లన్నీ ఆఫ్ చేసిందీ' అనుకుంటూ, స్కూటర్ బయటనే పెట్టి, గేటు తీయటానికి ట్రై చేశాడు శ్రీధర్. గేటు కదిలిన కారణంగా, లోపల ఉన్న తాళం కదిలి సందుల్లోనుంచి చేతికి తగిలేసరికీ... ఆ ప్రయత్నం మానుకొని.. "మీనాక్షీ! మీనాక్షీ" అని పిలిచాడు. పలకలేదు మీనాక్షి. ఇక పలకదని గ్రహించాడు. వెనక్కూ... పక్కలకూ... చూశాడు. ఎవరూ కనిపించలేదు. గేటు ఎక్కాడు. ఒక కాలు లోనికీ... మరో కాలు గేటు బయటికీ వేసి దిగటానికి ప్రయత్నించి కింద పడ్డాడు.

శబ్దం వినీ - కాసేపు అలక పక్కనపెట్టి తలుపు తీసింది మీనాక్షి.

బయటికి వచ్చి శ్రీధర్‌కు తన చెయ్యి అందించింది. కానీ పలకలేదు. ఒక్కతే ఇంట్లోకి నడిచింది. పైకి లేచిన శ్రీధర్... స్కూటర్ డిక్కీలో ఉన్న బొండుమల్లెల పొట్లం తీసుకొని ఇంట్లోకి వెళ్లాడు. అప్పటికే మీనాక్షి పడక సీనులో 'అలక దుప్పటి' కప్పుకుని ఉంది. అర్థమైంది శ్రీధర్‌కు. తేలిక చేయటానికి "మీనాక్షీ... చూడు! నీ కోసం బొండు మల్లెలు తెచ్చాను చూడూ! ఎంత కమ్మగా వాసన వస్తున్నాయో!"

అంటూ మల్లెల పొట్లం మీనాక్షి ముక్కు దగ్గర పెట్టాడు. మీనాక్షి పక్కకు తిరిగి పడుకుంది. శ్రీధర్ మరోదారి వెతికాడు. అది ఎత్తు కాదు. సత్యమే. "మీనాక్షీ! ఆకలేస్తుందోయ్" అన్నాడు. 'ఆకలి' మాట కూడా ఫలించలేదు. మీనాక్షి 'కనుబొమ్మ' అయిపోయింది. ఒంపుగా మారిపోయింది. ముడుచుకు పడుకుంది. లాభం లేదనుకొనీ... "మామూలే కదా!" అనుకొనీ, మల్లెల పొట్లం టీపాయ్ మీద పెట్టి డైనింగ్ టేబుల్ వైపు నడిచాడు. అన్నం ఉంది. కూరలు ఉన్న తాలూకు వాసన ఉంది. పెరుగుతో తిందాంలే అనుకున్నాడు. మీనాక్షి గుర్తుకు వచ్చింది. 'తాను తినంది నేను ఎలా తింటానూ' అనుకున్నాడు. బాటిల్లో ఉన్న నీళ్లు గడగడా తాగేశాడు. వచ్చి పడుకున్నాడు. మీనాక్షి మీద చెయ్యి వేశాడు. తీసి పారేసింది. "ఎంత అలిగితే మాత్రం ఇంత బెట్టు చెయ్యాలా?" అన్నాడు. సమాధానం లేదు. ఇంకాస్త దూరం జరిగింది మీనాక్షి.

'ఆ మాటల్లో, ఆ చేష్టల్లో పట్టె మంచం కూడా అలక తెచ్చుకుంది' సన్నగా కదిలింది. ఆ కదలిక శ్రీధర్‌కు మధురంగా అనిపించింది. అయినా చేసేది లేక, కాసేపు అలాగే ఉండి నిద్రపోయాడు.

మీనాక్షికి నిద్ర పట్టలేదు.

సెల్‌ఫోన్‌లో భర్త మాటలతో కలిసి వినిపించిన 'శబ్దమే' మళ్ళీమళ్ళీ గుర్తుకు వచ్చింది. మనసును కెలికింది. అంతరంగంలోకి చొచ్చుకొని పోయింది. ఆలోచనలు చుట్టుముట్టాయి. బుర్రను తొలచటం మొదలెట్టాయి... "ఇది నిజమా!" అనుకుంది అంతలోనే. "అయి ఉండదులే" అని మనసుకు సర్ది చెప్పుకుంది. 'మరీ... ఆ సమయంలో... వినిపించినట్లుండే ఆ శబ్దం సంగతీ!' అంతా గందరగోళం.

మీనాక్షి మనసూ, ఆలోచనలూ చాలాసేపు మాట్లాడుకున్నాయి. "మరి ఇప్పుడు కర్తవ్యం ఏంటి? సాధించడమా! పసిగట్టడమా! పుట్టింటికి వెళ్ళిపోవడమా! సూటిపోటి మాటలతో చితకగొట్టడమా!" అనుకుంది. ఇంతలోనే మళ్ళీ... 'మా ఆయన అలాంటోడు కాదులే! అందరి మగాళ్లనూ ఒకే గాటికి కట్టేస్తే ఎలా? చూద్దాం... చూసిన కళ్ళే ఒక్కోసారి పక్కదారి పట్టిస్తాయి. ఇక విన్న 'చెవులు' చెప్పిందే నిజమని ఎలా నమ్మాలి? చూద్దాం... నిప్పును గుప్పెట్లో పెట్టుకొని ఉండటం ఎవరికి సాధ్యం?... ఈ రోజు కాకపోతే రేపు నిజానిజాలు తెలియకుండా ఉండవు గదా' అనుకుంది. నిద్ర పట్టేసరికే చాలా పొద్దుపోయింది.

కడుపులో పేగులు ఆకలితో ఉన్నందువల్ల శ్రీధర్‌కు త్వరగా మెలకువ వచ్చింది.

ఆకలిగా ఉన్నా, ఆలోచనలు బరువుగా ఉండటంవల్ల మీనాక్షి అట్లే పడుకుంది.

మీనాక్షిని ప్రసన్నం చేసుకోడానికి... "మీనాక్షీ! మీనాక్షీ! కాఫీ రెడీ. లేచి ముఖం కడుక్కో" అన్నాడు శ్రీధర్. దుప్పటి క్రింద మనిషి అంతా అట్లే ఉండీ... నిచ్చెనలాగా చెయ్యి మాత్రమే పైకి ఎత్తీ... వద్దన్నట్లు ఊపింది మీనాక్షి. "అదేంటోయ్! నోటితో చెప్పొచ్చుగా. చెయ్యి ఊపటం ఏంటీ?" అంటూ మంచం మీద కూర్చొని భార్య ముఖం మీద పొరాడుతున్న ముంగురులు సవరిస్తుంటే... సడెన్‌గా లేచీ... "ఆహా! ఎంత ప్రేమో! అంతా నాకే ఇస్తే ఎలా? కాస్త ఉంచుకోండి. ఇంకా ఉన్నారుగా" అంటూ ఆ రోజు వెళ్ళవలసిన పని గుర్తుకు వచ్చి రెండు చేతులూ వెనక్కూ... ముందుకూ, బలంగా ఊపుకుంటూ హాల్లోకి వచ్చింది. "అదేంటే? ఆ ఎక్సర్‌సైజేంటీ... చేతులకేనా? మిగతా బాడీకి అక్కర్లేదా..." అంటూ వెంట నడిచాడు శ్రీధర్. "ఇప్పటికి తెలిసింది ఇదే! నిదానంగా అన్నీ తెలుస్తాయిలే" అంది మీనాక్షి. ఆ అన్యోక్తులు అర్థంకాని శ్రీధర్... పక్కన కూర్చోబోయాడు. లేచి బాత్‌రూమ్ వైపు నడిచింది మీనాక్షి. మనసులోని భావాన్ని చేతులు ఊపటంలో చూపిస్తూ... 'పెళ్ళికి వెళ్లాలి? గుర్తుందిగా! త్వరగా రెడీకా' అంటూ శ్రీధర్ వెళ్ళాడు. "మేం మర్చిపోయాం మరి... తమరికే మేం గుర్తుండం" అని మూతివిరుపులో మాటలు కలుపుకొని బాత్‌రూమ్ తలుపు 'ధన్'మని మూసింది. శ్రీధర్ తిరిగొచ్చి హాల్లో కూర్చున్నాడు.

ఓ పదిహేను నిమిషాల్లో స్నానం ముగించుకొని, టవల్‌తో తల తుడుచుకుంటూ వచ్చింది. "త్వరగా రెడీగా మీనాక్షీ! లేటుగా పోతే ఎలా?... తెలిసిన వాళ్ళు గదా" అన్నాడు శ్రీధర్. 'పెళ్ళి వాళ్ళకేనా? ఇంకా ఎవరికన్నా ఉందా" ఫ్యాన్ గాలికి కురులు ఆర్పుకుంటూ అంది. పెళ్ళి ముహూర్తం గురించే ఆలోచిస్తున్న శ్రీధర్ ఆ మాటను సరిగా వినలేదు. పట్టుచీర, దాని రంగుతో కలిసే గాజులూ, నగలూ వగైరా... వగైరా... అన్నీ ధరించి మీనాక్షి ముస్తాబయ్యే సరికి మరో అరగంట పట్టింది. 'నేను రెడీ' అన్నట్లు చూసింది. అందుకోసమే ఎదురుచూస్తున్న శ్రీధర్ స్కూటర్ స్టార్ట్ చేశాడు. మీనాక్షి మౌనంగా వెళ్ళి కూర్చుంది. పెళ్ళి పందిరి చేరుకొనేసరికి పదిహేను నిమిషాలు పట్టింది. పెళ్ళికి వస్తున్న వాళ్ళను సుభద్రమ్మా, ఆమె భర్త సాదరంగా ఆహ్వానిస్తూ కుర్చీలు చూపుతున్నారు.



'మా ఆయన అలాంటోడు కాదులే! అందరి మగాళ్లనూ ఒకే గాటికి కట్టేస్తే ఎలా? చూద్దాం... చూసిన కళ్ళే ఒక్కోసారి పక్కదారి పట్టిస్తాయి. ఇక విన్న 'చెవులు' చెప్పిందే నిజమని ఎలా నమ్మాలి? చూద్దాం... నిప్పును గుప్పెట్లో పెట్టుకొని ఉండటం ఎవరికి సాధ్యం?... ఈ రోజు కాకపోతే రేపు నిజానిజాలు తెలియకుండా ఉండవు గదా'

"రా! శ్రీధర్... రామ్మా! మీనాక్షీ... ఇంతలేటా?" అంది సుభద్రమ్మ.

"నాదేమీ లేటు లేదు" అంటూ మీనాక్షి వైపు చూశాడు శ్రీధర్.

"ఆడవాళ్ళు గదయ్యా... పదపద! ముందుకెళ్ళి కూర్చోండి" తన కుడి చేతి చూపుడు వేలును చూపించింది.

మంగళసూత్ర ధారణ జరగ్గానే, పెళ్ళికొచ్చిన వాళ్ళు భోజనాల వైపు నడిచారు. శ్రీధర్... మీనాక్షి కూడా వాళ్లతో కలిశారు.

"అబ్బే! వద్దాంటీ! ఇంక చాలు" అంది మీనాక్షి పరధ్యానంగా.

"తినమ్మా! వయసులో ఉన్నవాళ్లు మీరు తినకుంటే! మేం తింటామా ఏంటి?" అని మరో లడ్డూ వెయ్యబోయింది సుభద్రమ్మ.

"చాలాంటీ! ఇంక చాలు" అని సుభద్రమ్మ చేతులు పట్టుకుంది మీనాక్షి.

ఇద్దరి చేతుల మధ్య నుంచీ జారి లడ్డూ విస్తట్లో పడింది. ఇద్దరి చేతులూ లయబద్ధంగా కదిలాయి. ఇద్దరి చేతుల్లోని గాజులు గలగల నవ్వాయి. "అదే శబ్దం! అదే నాదం. అదే సవ్వడి... అదే స్వరం" సుభద్రమ్మ చేతిగాజుల వైపు అలాగే చూసింది మీనాక్షి. గమనించింది సుభద్రమ్మ.

భోజనాలు అయిపోయాయి.

"ఇందా! తీసుకోమ్మా" అని వెండిపళ్ళెంలో తీసుకొచ్చిన చీర, జాకెట్‌ను మీనాక్షికి ఇచ్చింది సుభద్రమ్మ. మునివేళ్లతో కాస్త పసుపు తీసుకొని చెక్కిళ్లకు రాసింది. కుంకుమ నుదుటిన పెట్టింది. మీనాక్షి చూస్తూండిపోయింది.

"ఇవిగో తల్లీ! మట్టిగాజులు. నేను ఎప్పుడూ ఇవే వేసుకుంటాను. నువ్వు కూడా కావాలన్నావ్‌గా! తీసుకో" మీనాక్షి చేతులకు తొడిగింది.

"అబ్బే! లేదాంటీ! నేను అడగలేదు" అంది మీనాక్షి మాటలు తడబడుతూ.

"నాకు తెలుసు తల్లీ! నీ చూపులు నా చేతుల్ని తాకినప్పుడే గమనించాను. శ్రీధర్ నా కొడుకులాంటి వాడు. నాకు ఏ పని పడినా శ్రీధర్‌కే చెబుతాను..." అంటూ ఆఫీసు గుర్తొచ్చీ... "పాడు ఆఫీసు. ఊళ్లో ఎక్కడా స్థలం లేనట్టు ఆ మూల కట్టారు. రాత్రి అయితే చాలు! ఒక్క నర మానవుడు కూడా అక్కడ ఉండడు. ఒక్క ఆటో కూడా తిరగదు. ఆఫీసు పని మీద రాత్రి వరకూ ఉండాల్సి వస్తే నా తిప్పలు చెప్పలేను తల్లీ. ఏదన్నా చిన్న బండి కొనుక్కుందామనుకుంటే, నడిపే వయసూ కాదు. పైగా రేపో మాపో రిటైర్ అయ్యేదాన్ని. శ్రీధర్ ఆఫీసులో చేరాక నాకా తిప్పలు తప్పాయి. నిన్న నువ్వు ఫోన్ చేసినప్పుడు నను అప్పుడే స్కూటర్ మీద కూర్చోబోతుంటే..." అంటూ "నా బిడ్డ పెళ్ళి కోసంపది రోజుల నుంచి సెలవులో ఉన్నా... సెలవు పెట్టినా నన్ను వదిలిపెట్టలేదు ఈ ఆడిట్... మా ఆఫీసర్ రిక్వెస్ట్ చేస్తే... తప్పనిసరి పరిస్థితుల్లో నిన్న ఆఫీసుకెళ్ళాను. ఏం అకౌంటెంట్ ఉద్యోగమో ఏమో! ఆ లెక్కలు, గిక్కలు చూసేసరికీ పొద్దుపోయింది" అని సుభద్రమ్మ చెప్పింది. మెచ్చుకోలుగా శ్రీధర్ వైపు చూసింది. కృతజ్ఞతా భావంతో శ్రీధర్ భుజం మీద చెయ్యి వేసింది.

మీనాక్షి తన్ను తాను చూసుకుంది. తన మనసును ఆవరించి ఉన్న సెగల పొగను ఉఫ్‌మని ఊదినట్లనిపించింది. శ్రీధర్ చేతివేళ్లను అప్రయత్నంగానే తాకింది.

"వెళ్ళొస్తామమ్మా" అన్నాడు శ్రీధర్.

"వెళ్ళొస్తామాంటీ" అని మీనాక్షి నవ్వే కళ్లతో చెప్పింది.

"మంచిది. వెళ్ళి రండి! నూరేళ్ళు చల్లగా ఉండండి" అంది సుభద్రమ్మ.

ఇంటికి రాగానే తన అలకకు కారణం ఏమిటో చెబుదామనుకుంది మీనాక్షి. చెబితే ఏమనుకుంటాడో శ్రీధర్ అనుకుని ఆగిపోయింది. 'చెప్పకపోతే ఎట్లా! భార్యాభర్తల మధ్య దాపరికాలు ఉండకూడదు కదా' అనుకుంది.

రాత్రయింది.

పడక మంచం మీద మీనాక్షి ఓరచూపులూ, వాలుజడ... అందులో మల్లెలూ... తేనె పలుకులూ శ్రీధర్‌ను రెచ్చగొట్టాయి. శ్రీధర్ ఎద మీద వాలి "ఏమండీ మీ చేతులు ఇటివ్వండి"

"ఎందుకూ?"

"ఇవ్వండి చెబుతా" అంటూ శ్రీధర్ ఇచ్చేవరకూ ఆగలేక తానే లాక్కొని, తన చెంపల దగ్గరకు జరుపుకొని... "కొట్టండి! నా చెంపలు వాచిపోయేటట్లు కొట్టండి" అంటూ తన రెండు చేతులతో శ్రీధర్ చేతులు పట్టుకుని కొట్టుకుంది. "గాజుల శబ్దం. సుభద్రమ్మ తన చేతులకు తొడిగిన మట్టిగాజుల శబ్దం." తాను సెల్‌ఫోన్ నుంచీ విన్న శబ్దం... తృప్తిగా వింది మీనాక్షి. అర్థంకాక శ్రీధర్ నిలువుగుడ్లు వేసుకొని చూశాడు. జరిగిన సంగతి చెప్పింది మీనాక్షి... "నన్ను మన్నించండి" అంది. శ్రీధర్‌ను గట్టిగా హత్తుకుంది. శ్రీధర్ ఆ షాక్ నుంచీ తేరుకొనేసరికి తెల్లారింది. ★